అర్హులకు న్యాయం చేయండి



ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన నిజాంపేట్ బీజేపీ నాయకులు

నిజాంపేట్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని బీజేపీ నేత ఆకుల సతీష్‌ముదిరాజ్ కోరారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నిజాంపేట్, కైసర్‌నగర్, దుండిగల్ తదితర ప్రాంతాల్లో ఎంపిక చేసిన ఇళ్ల లబ్ధిదారుల్లో 10 శాతం కూడా స్థానికులకు ఇవ్వలేదని, ఒకే కుటుంబంలో ఇద్దరికి ఇళ్లు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రజాప్రతినిధులు ఇష్టారాజ్యంగా తమకు అనుకూలంగా ఉన్న వారికి ఇళ్లను కేటాయించారని ఆరోపించారు. ఇళ్ల కేటాయింపులో లక్కీడ్రా పద్ధతిని పాటించలేదని, లబ్ధిదారులు కొందరు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో మోసం చేశారన్నారు. వీటన్నింటిపై విచారణ చేపట్టి అర్హులకు ఇళ్లను కేటాయించాలని బీజేపీ నాయకులు కోరారు. నాయకులు అమలేశ్వరి, అరుణ్ కుమార్, ముఖేష్, ఎల్ల స్వామి, కుమార్ గౌడ్, ఈశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి



కలెక్టర్ గౌతమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీని అర్హులైన వారందరికీ వర్తింపజేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం ఆయన మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ రైతులందరికీ రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పుడు నిబంధనలు, సాంకేతిక లోపం పేరుతో రైతులను మోసం చేస్తోందన్నారు. వర్షాలు పడుతున్న క్రమంలో నాట్లు వేసే సమయంలో రుణమాఫీని నీరుగార్చాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకంలో లోపాలను ఎత్తిచూపుతూ అసెంబ్లీలో చర్చ పెట్టి కొత్త నిబంధనలను చేర్చడం చూస్తుంటే రైతుబంధు పథకాన్ని ప్రభుత్వం నీరుగార్చే విధంగా వ్యవహరిస్తుంది. రైతుబంధు పథకంలో మేడ్చల్ జిల్లాకు రూ.39 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉండగా కేవలం రూ. 11 కోట్లు చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకొని రైతులందరికీ వర్తింపచేయాలని డిమాండ్ చేస్తున్నాం. మేడ్చల్ జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, బౌరంపేట్ ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, డైరెక్టర్ మధు, నాయకులు చింతల దేవేందర్ యాదవ్, మహేష్ యాదవ్, మేడ్చల్ జిల్లాకు చెందిన పలువురు రైతులు ఉన్నారు.

ప్రజావాణిలో 12 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఉప కమిషనర్ నరసింహ

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలోలలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పలు ఫిర్యాదులు వచ్చాయి.

- కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణిలో 12 ఫిర్యాదులు రాగా భూగర్భ ఒకటి, టాక్స్ సంబంధించిన ఈ మూడు, ఎలక్ట్రికల్ ఒకటి, టౌన్ ప్లానింగ్ మూడు, ఇంజనీరింగ్ 3, డ్రైనేజీ ఒకటి వచ్చినట్లు పేర్కొన్నారు.
- గాజుల రామారావు సర్కిల్ పరిధిలో ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు ఇంజనీరింగ్ 1 భూగర్భ డ్రైనేజీ సంబంధించింది మరొకటి ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. వీటిని వారం రోజుల్లో పరిష్కారం చూపాలని సంబంధిత విభాగాల అధికారులకు పంపారు.

24న బొడ్రాయి గ్రామ దేవత పునప్రతిష్టాపన

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిదిలోని మైసమ్మనగర్‌లో ఈ నెల 24 నుంచి 3 రోజుల పాటు శ్రీ బొడ్రాయి గ్రామ దేవత పునప్రతిష్టాపన కార్యక్రమం జరపనున్నట్లు కమిటీ తెలిపింది. 24న గణపతి పూజ, రక్షాబంధన, అంకురారోహన 25న క్షీరాదివాసం, గ్రామోత్సవం, 26న విగ్రహ ప్రాణ ప్రతిష్ట, బలిహరణం తదితర పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది.

బోనాలకు ముస్తాబవుతున్న ఆలయాలు

జగద్గిరిగుట్ట: ఆషాఢమాస బోనాల పండుగ సందర్భంగా డివిజన్ పరిదిలోని పలు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఆలయాల మరమ్మత్తుల నిమిత్తం ప్రభుత్వం చెక్కులు పంపిణీ చేసారు. వచ్చే ఆదివారం బోనాల పండగ సందర్భంగా ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా చూడండి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ముదిరాజ్ మహాసభ నాయకులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు సోమవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. వాటిని శాసనమండలిలో ప్రస్తావించి అమలయ్యేలా చూడాలని ఆయనను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చినంగి వెంకటేశం ముదిరాజ్, నాయకులు సత్యనారాయణ, ఏంబరి ఆంజనేయులు, శ్రీనివాస్, అశోక్ కుమార్, సురేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న యువకులు

నిజాంపేట్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఎల్లమ్మబండకు చెందిన అజీత్‌సింగ్, కలియసింగ్, బహదూర్‌సింగ్, పవన్ కళ్యాణ్, లోకేష్, జైరామ్, కరీం, రమేష్, అసిఫ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి హన్మంతరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వారికి ఉద్యోగవకాశాలు కల్పించేందుకు జాబ్ క్యాలెండర్‌ను త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేయనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి



కుత్బుల్లాపూర్ శ్రీసాయినాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: నాయిబ్రాహ్మణులు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించేందుకు కృషి చేయాలని ఆ సంఘం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు గడిల వెంకటేశ్వర్లునాయి అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ గ్రామ శ్రీసాయినాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఉప్పల హనుమంతరావునాయి, ప్రధాన కార్యదర్శిగా ఉప్పల వేణుగోపాల్ నాయి, చైర్మన్‌గా భీమ్‌రావునాయి, కోశాధికారిగా శ్రీనివాస్ నాయి, వైస్ ప్రెసిడెంట్‌గా ఉప్పల మధు నాయి, ప్రధాన సలహాదారులు ఉప్పల వీరేష్‌నాయి, ఉప్పల హరి నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల ప్రభాకర్ నాయి, ఆర్గనైజర్ సెక్రెటరీ సతీష్‌నాయి, వెంకటనారాయణ నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు బాలకృష్ణనాయి, ఆర్గనైజర్లుగాఉప్పల అనిల్ కుమార్‌నాయి, ఉప్పల పవన్ కుమార్‌నాయి, ఉప్పల వీరానంద్‌నాయి, ఉప్పల కిషోర్ నాయి, ఉప్పల నందునాయి లు నియమితులయ్యారు. నూతన కార్యవర్గంతో వెంకటేశ్వర్లు నాయి ప్రమాణ స్వీకారం చేయించారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



తహసీల్దార్‌కు మెమోరాండం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌కు మెమోరాండమ్ సమర్పించారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి జిల్లా ఇంచార్జి కన్వీనర్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌యాదవ్‌లు మాట్లాడుతూ కామారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించి వందరోజులు కావస్తున్నా నేటికీ అమలు చేయడం లేదని ఆరోపించారు. వెంటనే డిక్లరేషన్‌ను అమలు చేసి బీసీ కులస్తులకు న్యాయం చేయాలని కోరారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్ రెడ్డి, రాష్ట్ర ఓబిసి మోర్చా సహా ప్రచార కార్యదర్శి పత్తి రఘుపతి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగా శ్రీనివాస్‌గౌడ్, బొమ్మిడాల లక్ష్మణ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోపతి భానుచందర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు న్యాయకత్వ లక్షణాలు ఎంతో ముఖ్యం



గెలుపొందిన విద్యార్థులతో ముఖ్య అతిథులు

జీడిమెట్ల: విద్యార్థులకు దేశభక్తి, న్యాయకత్వ లక్షణాలు ఎంతో ముఖ్యమని టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి అన్నారు. సోమవారం ఎస్ఆర్ నాయక్ నగర్‌లోని సత్యవాణి స్కూల్‌లో పాఠశాల క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఓటింగ్ పద్ధతిలో సాగిన ఎన్నికల్లో పాఠశాల హెడ్‌బాయ్‌గా శౌర్యతివారి, హెడ్‌గర్ల్‌గా అపూర్వి ఎన్నికయ్యారు ఎన్నికల్లో గెలుపొందిన వారికి ముఖ్యఅతిథులు బ్యాడ్జ్, షోల్డర్ ఫ్లాప్స్‌లను అందజేశారు. ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులను ముఖ్య అతిధులు అభినందించారు.


బాధ్యతల స్వీకరణ

దుండిగల్: దుండిగల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సతీష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న శంకరయ్య సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో క్యాట్ నుండి వచ్చిన సతీష్ దుండిగల్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టారు.

నీటి మీటరుకు మరమ్మతులు చేయండి

చింతల్: నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినా ప్రతినెల బిల్లులు పంపిస్తున్నారని.. నీటి మీటర్ కు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ రుక్మిణి ఎస్టేట్‌లోని సాయి బాలాజీ నివాస్ అసోసియేషన్ సభ్యులు సోమవారం కుత్బుల్లాపూర్ వాటర్ జీఎం అశోక్‌ని కలిసి వినతి పత్రం సమర్పించారు. మీటరు సక్రమంగా పని చేయకపోవడంతో పాటు నీరు సరఫరా కావడం లేదని, ఏఎంఆర్ మీటర్ మరమ్మతులు చేపట్టాలని జలమండలి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జి.ఎం అశోక్ దృష్టికి తీసుకువచ్చారు.

వృద్ధుడి అదృశ్యం



భద్రయ్య (ఫైల్)

జగద్గిరిగుట్ట: మృతి స్థిమితం లేని ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిదిలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు.. జగద్గిరినగర్‌కు చెందిన దేవరకొండ భద్రయ్య (75)కు 4 సంవత్సరాల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మతి స్థిమితం కోల్పోయిడు. అప్పటినుండి ఇంట్లోనే ఉంటున్నాడు. ఆదివారం 2 గంటల ప్రాంతంలో ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుండి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వాళ్ల ఇండ్లలో, తెలిసిన బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ల నూతన కమిటీ ఎన్నిక



వైద్య ఆరోగ్య అధికారి భార్గవ్ నారాయణ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న అధ్యక్ష, కార్యదర్శులు

కుత్బుల్లాపూర్ : శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ కుత్బుల్లాపూర్ సర్కిల్ అధ్యక్షుడిగా చిట్యాల శివ కుమార్ ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో రెండవసారి అవకాశం కల్పించిన తోటి శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లకు శివకుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య అధికారి భార్గవ్ నారాయణ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రస్తాపురం రవీందర్, కోశాధికారిగా రవికుమార్ లతోపాటు రంగారెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడిగా వి. గణేష్, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షుడిగా మల్లేష్, కుత్బుల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడిగా కుమార్, జీడిమెట్ల డివిజన్ అధ్యక్షుడిగా జార్జ్ లను నియమించారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



పట్టుబడ్డ వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

సుభాష్‌నగర్: నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తప్పవని జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలో నంబర్ ప్లేట్ లేని, సరిగా నంబర్ లేని వాహనాలపై సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు వాహనాదారులు పట్టు పడగా అక్కడే నంబర్ ప్లేట్లు వేయించారు. అనంతరం నంబర్ ప్లేట్ ఉన్న వాటిని వాహనాలకు అమర్చకుండా తోలే వాహనదారులకు కలిగే ఇబ్బందుల గురించి వివరించారు. కొంత మంది వాహనాదారులు చలాన్లు పడుతున్నాయని కొన్ని నంబర్లను తీసివేసి వానాలను తోలడం పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సాధారణం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న రామ్‌రెడ్డి

రంగారెడ్డినగర్: ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, కష్టపడి పనిచేసే వారికి ఎక్కడున్నా గుర్తింపు లభిస్తుందని చేయూత ఫౌండేషన్ చైర్మన్, అభినవ కవి వాకిటి రామ్‌రెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు బదిలీలు, ప్రమోషన్లపై వెళ్లగా వారిని రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు కల్పనరెడ్డి, ఉపాధ్యాయులు మాధవి, కుమార స్వామిలకు మెమెంటోలు అందజేసి శాలువతో సత్కరించారు. అదే విధంగా చెన్నా రెడ్డినగర్ ప్రాథమిక పాఠశాల నుండి బదిలీపై వెళ్లిన మహేష్, పార్వతీ లకు మెమెంటోలు అందించే శుభాకాంక్షలు తెలిపారు.

గత ప్రభుత్వం కంటే ఎక్కువ సదుపాయాలు

టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి

జీడిమెట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు గత ప్రభుత్వం కంటే ఎక్కువ సదుపాయాలు కలుగజేస్తోందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. సోమవారం జీడిమెట్ల ఇండస్ట్రీయల్ అథారిటీ, ఐలా ఆధ్వర్యంలో టీజీఐఐసీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమెకు జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోషియేషన్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జేఐఏ, ఐలా, బాలానగర్, గాంధీనగర్ ఇండస్ట్రియల్ అసోషియేషన్ సభ్యులు నిర్మలా జగ్గారెడ్డిని పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా జేఐఏ అధ్యక్షులు ప్రవీణ్‌రెడ్డి, ఐలా చైర్మన్ సదాశివరెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు వారికి తగిన ప్రోత్సాహకాలు అందజేయాలని వారు కోరారు. గ్రేటర్ హైదరాబాద్ చుట్టు పక్కల టీజీఐఐసీ స్థలాలను పరిశ్రమలకు కేటాయించి పరిశ్రమ నెలకొల్పేందుకు కావాల్సిన అన్ని సదుపాయాలు అందించాలని విన్నవించారు.

ముగిసిన సాయినగర్ ఫౌండర్ సాయిలు అంత్యక్రియలు

నిజాంపేట్: బాచుపల్లి సాయినగర్ ఫౌండర్ సాయిలు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. సాయినగర్‌లో పేద ప్రజలకు గూడు కల్పించేందుకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని వక్తలు కొనియాడారు. సోమవారం సాయంత్రం జరిగిన సాయిలు అంత్యక్రియల్లో బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంతరెడ్డి, నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్, కార్పొరేటర్లు బాలాజీ నాయక్, దివాకర్‌లు ఆయనకు నివాళులర్పించారు.

గాజులరామారంలో సమస్యలు పరిష్కరించండి



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్ : గాజులరామారం సర్కిల్‌లో నెలకొన్న సమస్యలపై సోమవారం జరిగిన ప్రజావాణిలో బీజేపీ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్‌లు ఉపకమిషనర్ మల్లారెడ్డి వినతి పత్రం అందజేశారు. సర్కిల్ పరిధిలోని గాజుల రామారం, జగద్గిరిగుట్ట ప్రాంతాల్లో రోడ్లు అధ్వాన్నంగా మారాయని, పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తరలించకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడే అస్కారముందని ఉప కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. డివిజన్ అధ్యక్షుడు సతీష్, సాయినాథ్‌నేత, శ్రీధర్‌వర్మ, భీమరాజ్, సతీస్, రాము, లక్ష్మణ్, శ్యామ్‌లు ఉన్నారు.

పిల్లలకు టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలి

జగద్గిరిగుట్ట: తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రభుత్వం ద్వారా ఇచ్చే జేఈ టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలని అమ్మ ఆదర్స్ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ గూడ వరమ్మ తెలిపారు. సోమవారం మగ్దూంనగర్ మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఏపీసీలు, పాఠశాల ప్రదానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కుత్బుల్లాపూర్: వడ్డెర కులస్తులను ఎస్టీలో చేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం నగరంలోని ఇందిర పార్కు వద్ద చేపట్టిన ఒక రోజు దీక్షలో కొంపల్లి మున్సిపల్‌కు నుండి మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు శివరాత్రి బాలయ్య ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వడ్డెర కులస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితిలో వడ్డెర కులస్తులు ఉన్నారని, అన్ని రంగాల్లో తమ కులస్తులకు న్యాయం జరగాలంటే ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. శిబిరంలో మంజలి మల్లయ్య, సంపంగి వెంకటేష్, శివరాత్రి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

కుత్బుల్లాపూర్: దోమల నివారణ వాటి ద్వారా వ్యాపించే వ్యాధులపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఎంటమాలజీ సిబ్బంది స్కూళ్లల్లో కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. ఇందులో భాగంగా వెంకటేశ్వర్‌నగర్‌లోని సత్‌జ్ఞాన్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతల మల్లేశంయాదవ్ మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో వర్షపునీరు, మురుగు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా జ్వరాల బారిన పడితే వెంటనే ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోవాలన్నారు. తల్లిదండ్రులను, చుట్టు పక్కల ఇళ్ల వాసులను ఈ విషయంలో చైతన్యం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సివరేజీ ప్లాంట్ పనులు పరిశీలించిన గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని వెన్నెలగడ్డ ఎన్నా చెరువు ప్రాంతంలో నిర్మిస్తున్న ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను సోమవారం గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి సందర్శించారు. ఈ నెల 27వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఎస్టీపీని ప్రారంభించనున్న నేపథ్యంలో రహదారి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. వెన్నెలగడ్డ చెరువులో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్కను తొలగించాలని సూచించారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఉప కమిషనర్ నరసింహ, ఎస్ఇ చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం ఫతేనగర్‌లో నిర్మిస్తున్న ఎస్టీపీని పరిశీలించేందుకు వెళ్లారు.

జూదకేంద్రంపై పోలీసుల దాడి

నిజాంపేట్: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిపై కేసులు నమోదు చేసిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు నిజాంపేట్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న రియల్‌ఎస్టేట్ వ్యాపార కార్యాలయంపై సోమవారం దాడులు నిర్వహించారు. నిజాంపేట్‌కు చెందిన కన్‌స్ట్రక్షన్ వ్యాపారి కొత్తపాటి రమేష్(52), రావి శ్రీనివాస్‌రావు(53), సబ్బాని కిషోర్(36), అర్కిటెక్ కేశవప దుర్గారాజశేఖర్(46), కల్లూరు ధర్మరావు(52), సబ్బాని కిరణ్(30), వసంతం విజయభాస్కర్(50) లు పేకాటాడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచిరూ.12.320 నగదు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఆక్రమణలకు చెక్

- చెరువు కబ్జాపై స్పందించిన అధికారులు
- జేసీబితో తొలగింపు



కూల్చివేతలను అడ్డుకుంటున్న ప్లాట్ల కొనుగోలుదారులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పరిధి పరికి చెరువు శిఖం భూమిలో చోటు చేసుకున్న అక్రమణలపై గాజులరామారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. పరికి చెరువు స్థలంలో కొందరు వ్యక్తులు మట్టిపోసి అక్రమణలకు పాల్పడుతున్న విషయమై ఇటీవల మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రంగనాథ్ నేతృత్వంలో అధికారులు కబ్జాలను పరిశీలించి వాటిని తొలగించాల్సిందిగా ఆదేశించారు. దీంతో సోమవారం గాజులరామారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి సంగీత నేతృత్వంలో జేసీబీ సహాయంతో రెండు బేస్‌మెంట్లను తొలగించారు. ఈ క్రమంలో ప్లాట్లను కొనుగోలు చేసిన వ్యక్తులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు నిలిపివేసి వెనుదిరిగారు. పోలీసుల రక్షణతో మరోమారు కూల్చివేతలు చేపడతామని సంగీత పేర్కొన్నారు.